పెళ్లిపీటలు ఎక్కేలోపే...

అచ్యుతాపురం ఫార్మాకంపెనీ ప్రమాదంలో యువకుడు మృతి



పార్వతీపురం రూరల్ : విశాఖ జిల్లా అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మాలో బుధవారం సంభవించిన పెను ప్రమాదంలో మండలంలోని డోకిశిల పంచాయతీ చలమపలసకు చెందిన జవ్వాది పార్థసారథి (27) మృతి చెందాడు. చలమపలసకు చెందిన జవ్వాది కోటి, రమణమ్మ దంపతులకు రెండో కుమారుడు పార్థసారథికి అక్టోబర్ 5న పెళ్లి కావాల్సి ఉండగా ఇంతలోనే ఈ ప్రమాదం జరగడంతో గ్రామంలో విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహాన్ని గురువారం తరలించడంతో బంధువులు భారీ ఎత్తున చేరుకున్నారు. పార్థసారథి మృతి పట్ల ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సాకి గెడ్డలో నిలిచిపోయిన బస్సును బయటకు తోసుకొని వస్తున్న స్థానికులు

మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గెడ్డలు పొంగిపొర్లడంతో, చెరువుల్లో అధికంగా నీరు చేరి వరద బీభత్సం సృష్టించింది. పంట పొలాలతో పాటు పట్టణంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. పార్వతీపురం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వరద నీరు ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పాఠశాల బస్సు సాకిగెడ్డలో చిక్కుకుపోగా స్థానికుల సాయంతో సురక్షితంగా బయటపడింది. వీరఘట్టం మండలంలో వట్టిగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. తోటపల్లి కుడికాలువ పక్కన ఆర్అండ్‌బి రోడ్డుకు భారీ గండిపడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

నడుకూరు గ్రామ సమీపంలో నీటమునిగిన పంట పొలాలు

వరద బీభత్సం

- నీట మునిగిన పొలాలు... కాలనీలు
- ప్రధాన రహదారులపై నిలిచిన నీరు
- స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్/టౌన్

మండలంలోని ఏగిరెడ్డివలస సమీపంలోని రౌతు సాగరంలో జడిదేవరగెడ్డకు వరద నీరు అధికంగా రావడంతో పుట్టూరు గ్రామ శివారుల్లో పల్లపు భూములు ముంపునకు గురయ్యాయి. సుమారు వందెకరాల వరి చేను పూర్తిగా నీట మునిగిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అల్లిగాజులపేట దగ్గర ఉన్న సాకిగెడ్డలో భారీగా చేరిన వరద నీరు బందులుప్పి, పులిగుమ్మి ప్రధాన రహదారితో పాటు, పుత్తూరు, బందులుప్పి తాళ్ల బురిడి రహదారిపై కూడా భారీగా వరద రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మక్కువ మండలంతో పాటు ఒడిస్సాలోని పలు గ్రామాలకు ఈ రహదారిపైనే రాకపోకలు సాగుతంతో, ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఎక్కడికక్కడ ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్కూల్ పిల్లలను తీసుకొచ్చే పాఠశాల బస్సు వరద మధ్యలో చిక్కుకుపోవడంతో స్థానికులు స్పందించి బస్సును రోడ్డుకు చేర్చడంతో ప్రమాదం తప్పింది. అలాగే పలు గ్రామాలకు చెందిన ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో పార్వతీపురం తప్పనిసరి కావడంతో వరద లోనే దిగి రోడ్డుకు చేరాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వరద ప్రాంతాలను సందర్శించి అధికారులను పిలిపించుకొని పంట నష్టాలపై అంచనాలను వేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనూహ్యంగా బుధవారం 89.5 మిల్లీమీటర్ల వర్షపాతం కురియడంతో వరహాలుగెడ్డ, సాకిగెడ్డలతో పాటు ఒడిశాకు చెందిన పలు గిరి శిఖరాల నుంచి వర్షపు నీరు భారీగా చేరడంతో చెరువులు నిండిపోయి మిగులు జలాలు పొలాల్లోకి, గెడ్డల్లోకి చేరడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని అన్నారు. ఇరిగేషన్ అధికారులతో సంప్రదించి భవిష్యత్తులో ఇలాంటి నష్టాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని కోరుతానని, అవసరమైతే ఎక్కడికక్కడ చెక్ డామ్‌లు నిర్మించి వర్షపు నీరు వృథాగా పోకుండా నిల్వ ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలని కోరుతున్నామని తెలిపారు.

ట్రాఫిక్ అంతరాయంతో నిలిచిన వాహనాలు

బుధవారం రాత్రి సుమారు రెండు గంటల సేపు కురిసిన భారీ వర్షానికి బెలగాం శివారులో గల వరహాలగెడ్డలో భారీగా వరద నీరు చేరింది. దీంతో ప్రధాన రహదారిపైనే వరదనీరు ప్రవాహం చెందితో రోడ్డుకు దగ్గర్లో ఉన్న వెంకటేశ్వర్ల నర్సింగ్ హోమ్, అపార్ట్‌మెంట్, చైతన్య స్కూలుకు వెళ్లే రహదారి జలమయమైంది. ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళి, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు జెసిబి, పారిశుధ్య కార్మికుల సహాయంతో వరద నీరు మళ్లింపునకు చర్య చేపట్టారు. వరహాలగెడ్డ వరద నీరు వెళ్లేందుకు దారి లేకపోవడానికి ప్రధాన కారణం బెలగాం శివారులో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అపార్ట్మెంట్లు, భారీ వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్న యజమానులు గెడ్డ పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించడమే. ముఖ్యంగా ఈ భవన నిర్మాణాలు చేపడుతున్న సమయంలో సంబంధిత టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ అధికారులతో పాటు సచివాలయాల కార్యదర్శులు పర్యవేక్షణ చేయకపోవడమే కారణమని, ప్రతి ఏటా వర్షాలు కురుస్తున్న సమయంలో ఈ పరిస్థితి పునరావృతం అవుతుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. భారీ వర్షాలు కురిసేటప్పుడు వరహాల గెడ్డ పొంగిపొర్లుతున్న సమయం వరదనీరు ప్రధాన రహదారిపై ప్రవహించకుండా ఉండేందుకు గెడ్డ పరివాహక ప్రాంతం పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తోటపల్లి కుడికాలువద్ద వద్ద ఆర్అండ్‌బి రోడ్డుకు పడ్డ భారీ గండి

పార్వతీపురంలో ముంపునకు గురైన అపార్ట్‌మెంట్

వీరఘట్టం : మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి గురువారం వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వీరఘట్టం వట్టిగెడ్డతో పాటు, నడుకూరు సమీపంలోని సీతమ్మ సాగరం చెరువు నీరు కాలువ ద్వారా ప్రవహించడంతో వరి పంట నీటి మునిగింది. అలాగే కుమ్మిడిగెడ్డ నీరు కూడా ఉరకలేస్తూ వృధాగా వట్టిగెడ్డలోకి కలిసిపోతుంది. ఇదే వరద నీరు ఆదా చేస్తే గంగంపేట సమీపాన 200 ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడుతుందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలురు వశతి గహంలోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు అవస్థలకు గురయ్యారు. భవనానికి మధ్యలో కొంతమేరకు స్థలం ఖాళీగా ఉండడం వల్ల వర్షం నీరు అందులో పడి కాలువల ద్వారా బయటకు వెళ్లే పరిస్థితి ఉండేది. కురిసిన వర్షం నీరు కాలువ ద్వారా వెళ్లకపోవడంతో వసతి గృహంలోనే నీరు నిలిచిపోయింది.

రహదారికి భారీగండి

గరుగుబిల్లి: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి శ్రీకాకుళం నుండి పార్వతీపురం ప్రధాన రహదారి పరిధిలో గల ఉల్లిభద్ర వద్ద గల తోటపల్లి ప్రాజెక్టు కుడిప్రధాన కాలువ వద్ద ఆర్ అండ్ బి రహదారికి భారీ గండి పడింది. కుడి ప్రధాన కాలువ వద్ద ఆర్ అండ్ బి రహదారికి గండి పడిన విషయం తెలుసుకున్న ఆర్ అండ్ బి శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చి వేసేందుకు చర్యలు చేపట్టారు. అలాగే పార్వతీపురం- శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలో వాహనాల రాక పోకలకు ఇబ్బందులు లేకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా గండిని పూడ్చేందుకు చర్యలు చేపట్టినట్టు జెఇ పెద్దింటి ప్రమీల తెలిపారు. అలాగే ఏమాత్రం వర్షం కురిసినా రహదారిపై నీరు నిల్వ ఉండడంతో తరచూ రహదారి మరమ్మతులకు గురవు తోందని పలువురు ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉల్లిభద్ర కుడి ప్రధాన కాలువ సమీపంలో రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

గెడ్డ నీటి ప్రవాహం మళ్లింపునకు చర్యలు చేపట్టాలి : సిపిఎం

భారీ వర్షం కురవగానే బెలగాం శివారులో ఉన్న గెడ్డ నీటి ప్రవాహం పెరగడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, గెడ్డ నీరు మళ్లింపునకు చర్యలు చేపట్టాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరహాల గెడ్డ ఉత్తర దిశగా ఉన్న గట్టు కోతకు గురవ్వడంతో చైతన్య స్కూల్‌కు, బిఎస్ అపార్ట్మెంట్‌కు, ఆ పక్కనే ఉన్న బిఎస్ నగరుకు రోడ్డుపై మోకాలు లోతు వరకు నీరు ప్రవహించడంతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ఉద్యోగులు, ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలకు, మెయిన్ రోడ్డుకు తూర్పున ఉన్న అపార్ట్మెంట్‌లోకి నారాయణ, శ్రీ సీజన్ స్కూళ్లకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కావున, మెయిన్ రోడ్డు దిగువన గల కాలువలో అడ్డుకట్టగా ఉన్న చెత్తను తొలగించాలని, ఉత్తర వైపున గెడ్డ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంకురు సూరి బాబు, పి.రాజశేఖర్ ఉన్నారు.

కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

పంచాయతీల ఆమోదంతోనే ఉపాధి పనులు

- నేడు జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు
- ప్రజల సమక్షంలోనే పనుల ఎంపిక
- మార్గదర్శకాల అమలుకు మరోసారి కసరత్తు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలుకు పంచాయతీరాజ్ శాఖ మరోసారి కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రతి పనికీ పంచాయతీల ఆమోదం తప్పనిసరి చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఈనేపథ్యంలో ఈనెల 23న జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ గ్రామసభలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాటు ఇప్పటికే జరిగాయి. గ్రామ సభల ఆమోదంతోనే పనులు చేపట్టాలన్న నిబంధన అమలు జరిగితే ఆయా గ్రామాల్లోని పెత్తందారులు, బినామీల ఏకపక్ష నిర్ణయాలకు కొంతలో కొంతైనా బ్రేకు పడే అవకాశం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

వామపక్షాల ఒత్తిడితో 2005లో అప్పటి యుపిఎ-1 ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని రూపొందించిన విషయం విధితమే. దీని అమలులో విజయనగరం జిల్లా ముందంజలో ఉంటోంది. జిల్లాలో వలసల నివారణకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ పథకం ఆలంబనగా నిలుస్తోంది. ఏటా జిల్లాలో ఎక్కువ మంది పనిదినాలను ఉపయోగించుకోవడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో సుమారు 1.93లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. 3.94లక్షలమంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే, గ్రామాల్లో ఏయే పనులు చేపట్టాలన్న విషయంలో గ్రామంలో పెత్తందారులు లేదా సర్పంచుల బినామీదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంటోంది. మెజార్టీ గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. దీంతో, కూలీలకు 100రోజుల పని గ్యారెంటీగా దొరుకుతున్నప్పటికీ చేపట్టిన పనులు నిరుపయోగంగానూ, కొన్ని చోట్ల ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టే విధంగా ఉన్నాయి. లేదా కొందరు వ్యక్తులకు ఉపయోగపడే విధంగాను ఉన్నాయి. ఇటువంటి పరిస్థితికి చెక్‌పెట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ గ్రామ సభల తీర్మాణంతోనే పనులు చేపట్టాలన్న నిబంధన తప్పనిసరిగా అమలు చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 775 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఈ సభలు జరగనున్నాయని అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో చాటింపులు కూడా వేసినట్టుగా సమాచారం. వాస్తవానికి ఈ నిబంధన కొత్తదేమీ కాదు. అర్హులైన కుటుంబాలన్నింటికీ జాబ్‌కార్డులు ప్రభుత్వం మంజూరు చేయాలి. అడిగిన వెంటనే పని కల్పించాలి. వారంలోపే కూలి డబ్బులు చెల్లించాలి. 14రోజుల్లోపు పని కల్పించకపోతే కార్డుదారుడికి నష్టపరిహారం కూడా చెల్లించాలి. ఇలా అనేక నిబంధనలు ఉపాధి చట్టంలో ఉన్నాయి. వీటిలో గ్రామ సభల ఆమోదంతోనే పనులు చేపట్టాలన్న నిర్ణయం తప్పనిసరిగా అమలు చేయాలని మంత్రి ప్రతినిబూడం మంచిదే కానీ, ఈ చట్టం అమలులో అనేక లోటుపాట్లు ఉన్నాయి.

కూలీలకు తప్పని కష్టనష్టాలు

పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచీ సొంతంగా పార, గునపం, తట్టలు తెచ్చుకున్నందుకు గాను రోజుకు రూ.5 చొప్పున అద్దె చెల్లించేవారు. మార్చి ఏప్రిల్, మేనెలల్లో ప్రతి కూలీకి వారానికి రూ.20 చొప్పున వేసవి అలవెన్స్‌లు అదనంగా అందేవి. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ సదుపాయం కల్పించేందుకు కూడా నిధులు కేటాయించేవారు. గత ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ సదుపాయాలన్నీ రద్దుచేసింది. దీనిపై అధికారులను ప్రశ్నించగా గతంలో స్టేట్ సర్వర్ సెంటర్ (ఎస్‌టిసి)లో అద్దెలు, అలవెన్సుల నమోదుకు అవకాశం ఉండేదని, ఎస్‌టిసి స్థానంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌లో వాటి నమోదు అవకాశం లేదని చెబుతున్నారు. ఫలితంగా కూలీలు మండుటెండలో పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గత ఏడాది నుంచి రెండుపూటలా ఉదయం 6 గంటల నుంచి 10:30 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 6.30గంటల వరకు పని చేయాల్సివస్తోంది. గత ఏడాది రోజుకు రూ.272 చొప్పున కూలిరేటు నిర్ణయించగా ఆచరణలో కూలీల చేతికి రూ.250 మించి అందే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఏడాది (ఏప్రిల్ 1 నుంచి) కూలిరేటు కేవలం రూ.28 మాత్రమే పెంచారు. అంటే రోజుకు రూ.300 అన్నమాట. కూలిరేటు పెంచిన తరువాత ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదు. కాబట్టి ఎంత అందుతుందో ఇప్పటికీ అర్థం కావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కూలీలంతా పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరుతున్నారు. సగటు కుటుంబాల జీవనానికి ఇంత కీలకమైన ఉపాధి పనులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనలు దూరం చేస్తున్నాయి. ఉపాధి చట్టానికే తూట్లు పొడుస్తున్నాయి. ఈనేపథ్యంలో కూలీల ఇబ్బందులపై మంత్రి పవన్ కల్యాణ్ కేంద్రంతో పోరాడాల్సి ఉంది.

సిఎం ఇ-ఐ కేంద్రాలు ఎత్తేస్తారా?

- పిపిపి పద్ధతిలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు
- సెప్టెంబర్‌తో ముగియనున్న కాంట్రాక్టు
- ఆందోళనలో ఉద్యోగులు

ప్రజాశక్తి - సాలూరు

ఉమ్మడి విజయనగరం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల ముఖ్యమంత్రి ఇ-ఐ కేంద్రాల పరిస్థితి అయోమయంలో పడింది. 2018లో టిడిపి హయాంలోనే ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అపోలో ఆసుపత్రులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటైన కంటి విభాగం కేంద్రాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. రానున్న సెప్టెంబర్‌లో ఈ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పంద కాలపరిమితి ముగిసిపోనుంది. గత ఐదేళ్లుగా ఈ కేంద్రాల ద్వారా నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఉత్తమమైన కంటి సేవలు అందాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గల గిరిజనులకు ఈ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయి. పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న గిరిజనులకు ఎక్కువగా కంటి సంబంధిత సమస్యలు వస్తుంటాయి. వీరికి తనిఖీలు చేసి దృష్టి లోప నివారణకు కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో గల ఈ కేంద్రంలో ప్రతి రోజూ 30 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. ఈ కేంద్రంలో కంటి డాక్టర్, ఇద్దరు ఉద్యోగులు పని చేస్తున్నారు. కంటి డాక్టర్ ప్రభుత్వానికి చెందిన వైద్యునిగా పని చేస్తున్నారు. మిగిలిన ఇద్దరు ఉద్యోగులు అపోలో హాస్పిటల్స్‌కు చెందిన వారు. వీరికి అపోలో హాస్పిటల్స్ యాజమాన్యమే జీతాలు చెల్లిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కేంద్రాలు 150 వరకు వున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎస్.కోట, గజపతినగరం, సాలూరు, కురుపాం, చీపురుపల్లి, భోగాపురం, బాడంగి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఇవి పని చేస్తున్నాయి.

సెప్టెంబర్‌తో ముగియనున్న కాంట్రాక్టు

వచ్చేనెలతో అపోలో హాస్పిటల్స్, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం ముగియనుంది. దీంతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం కొనసాగిస్తుందా, ఎత్తేస్తుందా అన్న స్పష్టత లేకపోవడం, కొత్త సంస్థతో ఒప్పందం కుదిరితే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో గల కేంద్రాల్లో సుమారు 400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏవిధమైన స్పష్టత రాకపోవడంతో వారి మనుగడ ప్రశ్నార్థకమవుతుందనే భయాందోళనకు గురవుతున్నారు.

గిరిజన సంక్షేమ మంత్రి దృష్టి పెడతారా?

టిడిపి ప్రభుత్వం హయాంలోనే ప్రారంభమైన ముఖ్యమంత్రి ఇ-ఐ కేంద్రాల ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద గిరిజనులకు అవసరమైన సేవలు అందుతున్నాయి. ఇవి లేకపోతే వీరు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాష్ట్రంలో గల ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సిఎం ఇ-ఐ కేంద్రాలనైనా కొనసాగేలా గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి కృషి చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టు ఎత్తివేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇ-ఐ కేంద్రాలు కొనసాగించాలి

సిహెచ్‌సిల్లో గల ముఖ్యమంత్రి ఇ-ఐ కేంద్రాలను కొనసాగించాలి. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ కేంద్రాలకు సంబంధించిన ఒప్పందం సెప్టెంబర్ తో ముగియనుంది. ఈ కేంద్రాల ద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. గిరిజనులకు ఎక్కువగా కంటి సంబంధిత సమస్యల పరిష్కారానికి ఇవి దోహదపడుతున్నాయి. కావున మంత్రి సంధ్యారాణి జోక్యం చేసుకుని కొనసాగేటట్లు చూడాలి.

ఎన్వైనాయుడు,
సిఐటియు జిల్లా కార్యదర్శి

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఆటో నగర్ సబ్ స్టేషన్, పాచి పెంట మండలంలోని జిఎన్ పేట సబ్ స్టేషన్ల మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో ఈనెల 23 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ డిఇ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా శ్రీనివాసా కాలనీ, గాంధీనగర్, చిన బజార్, ఏరియా ఆసుపత్రి, మజ్జులపేట, బంగారమ్మ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అలాగే పాచిపెంట మండలం లోని గురివినాయుడు పేట, పాంచాలి, మోసూరు, మాతుమూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంత ప్రజలు, రైతులు సహకరించాలని డిఇ కిశోర్ ఆ ప్రకటనలో కోరారు.

సీతంపేట : మండలంలోని 33/11కెవి సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం మండలంలోని కుసిమి జిపికి విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఇఇ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

తక్కువ ధరకే ఇసుక : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక సరఫరా పథకంలో భాగంగా ప్రజలకు తక్కువ ధరకు వేగవంతంగా అందించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భామిని మండలం కాట్రగడ్డ ఇసుకర్యాంపు నుండి ఇసుక తీసేందుకు అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ఇసుక తీత, రవాణాచార్జీలు మాత్రమే వసూలు చేయనున్నట్టు తెలిపారు. ఇసుకను అనుమతి లేకుండా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 10కిలోమీటర్లు, 25 కిలోమీటర్ల వరకు స్థిర చార్జీలు నిర్ణయించబడతాయన్నారు. మెట్రిక్ టన్నుకు కనీస ధర రూ.400లోపు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టాకు పాయింటు వద్ద పోలీసు పోస్టు, సిసి కెమెరాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, స్టాకు సంబంధించి పూర్తి రికార్డులు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం నుంచి జిల్లాలోని 451 గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. ఉపాధి హామీపనులు, సామాజిక, వ్యక్తిగత పనులకు సంబంధించి కూడా గ్రామసభల్లో తీర్మానం మేరకు ఆమోదానికి ప్రతిపాదనలు పంపున్నట్టు తెలిపారు. ఈ సభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొనాల్సింది సూచించారు.

అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జిల్లా పర్యటనకు శుక్రవారం వస్తున్నారన్నారు. తొలుత సీతానగరం పిహెచ్‌సిని తనిఖీ చేస్తారని, సూరంపేట గ్రామ పంచాయతీ మర్రిపివలస గ్రామ సందర్శన అనంతరం జిల్లా ఆసుపత్రి సందర్శించి వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో పాల్గొంటారని తెలిపారు. పిఎం జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పివిటిజి)ల సమీకృత అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. తాగునీరు, విద్య, ఆరోగ్యం, గృహాల కల్పన శత శాతం కల్పించే లక్ష్యంగా, వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ జీవన ప్రమాణాల్లో మంచి మార్పులు తీసుకొనేందుకు కుటుంబం యూనిట్ గా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు అనుసంధానం కాని గిరిజన ఆవాసాలకు రహదారులు నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యప్రసాద్ రాక

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్య ప్రసాద్ స్థానిక పిహెచ్‌సిని శుక్రవారం పరిశీలించనున్నారు. ఈ మేరకు పిహెచ్‌సిలోని ఏర్పాట్లను ముందస్తుగా డిఎంహెచ్ఒ డాక్టర్ విజయ పార్వతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ జగన్మోహన్, జిల్లా మలేరియా అధికారి వై.మణి గురువారం పరిశీలించారు. మంత్రి కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, సీతానగరం వైద్యులు ఉషారాణి, పావణిలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

శిశు సంరక్షణ కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలోని శిశు సంరక్షణ కేంద్రాలను, అనాధ శరణాలయాలను ఐసిడిఎస్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది గురువారం ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పార్వతిపురంలో గల శిశు గహ, బాలసదనం, సీతానగరంలోని లచ్చయ్యపేటలో గల బాలల సంరక్షణ కేంద్రంలో తనిఖీ లు నిర్వహించారు. అనాధాశ్రమాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహారం, తాగునీరు వసతి, విద్య, ఆరోగ్యం, రక్షణ భద్రత విషయాలను, పరిసరాల పరిశుభ్రతను, రికార్డులను పరిశీలించారు. యాక్ట్ ప్రకారం గా అనుమతులు తీసుకున్నది లేనిది ఈ బందం తనిఖీ చేసి ఉన్నారు. డిపిఒ వివి రవికుమార్, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఎన్ ప్రసాదు రావు, ఎంఎ నాయుడు, పి.శ్రీధర్, సిడిపిఒలు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

సెప్టెంబర్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిర్వహించే జిల్లా స్థాయి యువజనోత్సవాలు (సాంస్కృతిక పోటీలు)ల్లో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజనోత్సవాల్లో ఆసక్తి గల యువతీ యువకులు (15-29 వయస్సు) సంబంధిత పోటీల్లో పాల్గొనేందుకు సాధనతో సన్నద్ధంగా ఉండాలన్నారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యాలు (బృందం), జానపద గీతాలు (బృందం), జానపద నృత్యాలు (సోలో), జానపద గీతాలు (సోలో). అలాగే జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్ (ప్రకటన).

యువ కృతి విభాగంలో హస్త కళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. పాల్గొన్నదల్చిన వారు కార్యాలయాపు పనివేళల్లోనూ, 9849913080, 8247554334 ఫోన్ చేయాలని తెలిపారు.

విజేతలను అభినందిస్తున్న డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్

క్రికెట్ విజేత సాలూరు టౌన్

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో క్రికెట్ విజేతగా సాలూరు టౌన్ టీం నిలిచింది. రన్నర్స్‌గా సాలూరు రూరల్ టీం నిలిచింది. ఈ రెండు టీములను గురువారం డిప్యూటీ డిఇఒ రాజ్ కుమార్ అభినందించారు.

నేడు చదురు గుడిలో కుంకుమ పూజ

ప్రజాశక్తి -మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి చదురగుడిలో కుంకుమ పూజలు జరపనున్నట్లు ఆలయ ఇఒ సూర్యనారాయణ తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళ భక్తులకు కుంకుమ పూజకు అవసరమైన సామాగ్రిని తాము ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. భక్తులు అవసరం మేరకు కొబ్బరికాయ, కలశం తదితర వస్తువులు తీసుకురావాల్సి ఉంటుందని వెల్లడించారు.

గుమడ రైల్వే స్టేషన్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గుమడ రైల్వే స్టేషన్‌కు రోడ్డు మార్గంలో గోతులను పూడ్చివేసి ప్రయాణికులకు భరోసా కల్పించాలి సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం గుమడ రైల్వే మాస్టర్ వై .వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని 31 పంచాయతీలకు సంబంధించిన గ్రామాల రైల్వే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరమైన రాయగడ వెళ్లే అంతరాష్ట్ర రహదారి నుంచి గుమడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే కిలోమీటర్ రహదారి మార్గంలో మూడో రైల్వే లైన్ పనులు నిమిత్తం పెద్దపెద్ద వాహనాల రాకపోకలతో ఈ రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి అన్నారు. గతంలో ఈ రహదారి మరమ్మతుల కోసం వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తే అప్పట్లో రోడ్డు నిర్మించారని తెలిపారు. మళ్లీ ఇటీవల కాలంలో జరిగిన మూడో లైను రైల్వే పనుల్లో భాగంగా గోతులు ఏర్పడ్డాయని తెలిపారు. రోడ్డుపై గోతులు ఏర్పడడంతో నిత్యం రైల్వే ప్రయాణికులు ఆ గోతుల్లో పడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్టేషన్ మాస్టర్ స్పందిస్తూ త్వరలో విశాఖ డిఆర్ఎంకు ఈ విషయం తెలియజేస్తామని తెలిపారు.

శంకర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు

శంకర్ కుటుంబాన్ని ఆదుకున్న భగత్ సింగ్ ట్రస్ట్

ప్రజాశక్తి -భామిని

మండలంలోని సతివాడకు చెందిన నెల్లి శంకర్ సెంట్రింగ్ పనులు చేస్తుండగా సెంట్రింగ్ కూలి తీవ్ర గాయాలై రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కయిన శంకర్ ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొడంతో భార్య, ముగ్గురు ఆడ పిల్లలు జీవనం అధ్వానంగా ఉంది. నిసన్నహాయ పరిస్థితుల్లో ఉన్న అతనికి వైద్యం కోసం భగత్ సింగ్ ట్రస్ట్‌ను కొంత మొత్తాన్ని అందజేసింది. అలాగే ట్రస్ట్ సొంత ఖర్చుతో మినీ కిరాణా దుకాణం ఏర్పాటు చేసి ఆదుకుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు

కుక్కను రక్షించిన స్థానికులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మినీ గురుకులం వెనుక భాగం లో కొత్తగా భవనం నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంకులో కుక్క జారి పడిపోయింది. దీంతో కుక్క అరుపులు విని చుట్టుపక్కల వారు వచ్చారు. మంచం సాయంతో కుక్కను సెప్టిక్ ట్యాంకు నుంచి పైకి తీశారు.

కుక్కను పైకి తీస్తున్న దృశ్యం

గ్రామసభల్లో ఉపాధి పనులు ఆమోదం పొందాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉపాధి హామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ సభలపై పలు సూచనలు చేశారు. గ్రామ సభల్లో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా ఎంపిడిఒలు బాధ్యత తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు వీలున్నంత ఎక్కువ గ్రామసభలకు హాజరు కావాలని సూచించారు. గ్రామసభల కార్యక్రమాలన్నీ వీడియోగ్రఫీ చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా, సభలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధి హామీలో ప్రస్తుతం, భవిష్యతులో చేపట్టబోయే పనులను తెలియజేయాలని తెలిపారు. వ్యవసాయ అనుబంధంగా జరిగే పనులకు, ఉద్యాన వనాలకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. గ్రామ స్థాయిలో సంబంధిత సిబ్బంది అందరూ విధిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

సీతానగరం : ఉపాధిహామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సక్రమంగా నిర్వహించాలని ఇఒపిఆర్‌డి కుమార్ వర్మ తెలిపారు. సర్పంచుల అధ్యక్షతన నిర్వహించే గ్రామ సభల్లో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. 35 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఉప-ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా

గ్రామ సభలకు అంతా సిద్ధం

ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. గ్రామసభలను వీడియోగ్రఫీ చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధిహామీలో ప్రస్తుతం జరుగుతున్న పనులను, భవిష్యతులో చేపట్టబోయే పనులను కూడా తెలియజేయాలన్నారు. గ్రామ స్థాయిలో సంబంధిత సిబ్బంది అందరూ విధిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

మక్కువ : మండలంలోని 21 గ్రామపంచాయతీ పరిధిలోని శుక్రవారం జరగనున్న గ్రామ సభలకు అధికారులంతా హాజరు కావాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఆయా పంచాయతీ పరిధిలోని అన్ని రకాల సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలతో హాజరు కావాలని సూచించారు.

సీతంపేట : ఐటిడిఎ పరిధిలోని అన్ని మండలాలు, అన్ని పంచాయతీలో సదస్సులు నిర్వహించాలని ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ వివి రమణ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ఎంపిడివో, పంచాయతీ స్థాయిలో పంచాయతీ సెక్రటరీ ఈ అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. సదస్సులలో పీఎం జన్ మాన్ కార్యక్రమంలోని 11 రకాల పథకాల యొక్క ముఖ్య ఉద్దేశాలు, ఆ పథకాల ద్వారా గిరిజనులకు కలిగే లబ్ధి వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే11 రకాల పథకాలైన హౌసింగ్, విద్యుత్, రహదారులు, ఇంటింటికి కొళాయి, విద్య, వైద్యం, జీవనోపాదులు మెరుగుపర్చడం వంటి అంశాలపై ప్రభుత్వం చేపట్టనున్న అభివృద్ధి కార్యకలాపాలపై ప్రజలకు వివరంగా చెప్పాలని తెలిపారు. పిఎం జన్ మాన్ అవగాహన సదస్సుల నిర్వహణ ఫోటోలను ప్రతీరోజు విధిగా పీఎం జన్ మాన్ వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయాలని సూచించారు.

వర్క్‌షాపులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

ప్రకృతి వ్యవసాయంపై వర్కుషాప్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మండల వ్యవసాయ అధికారులు, ప్రకృతి వ్యవసాయ సహాయ కులకు వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి వర్కుషాపులో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల లాభాలు, సాగు విధానాలు, నవధాన్యాలు జల్లుట వల్ల కలిగే ఉపయోగాలు తదితర అంశాలపై వర్కుషాప్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ నెల 9న విజయవాడలో రాష్ట్ర స్థాయి వర్కుషాప్ నిర్వహించారని, ఈ వర్కుషాప్ ద్వారా తెలుసుకున్న విషయాలను మండలంలో గల వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రోగ్రాం మేనేజరు పి.షణ్ముఖరాజు వర్కుషాప్‌లో వివిధ అంశాలను వివరిస్తూ ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యమైన భూమిని, పంటను సాధించి తద్వారా ఆరోగ్యమైన జీవితాన్ని అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏ రకమైన ఎరువులు, రసాయినక మందులు వాడుకుండా ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటల ఉపయోగాలను ప్రజలకు తెలియాలన్నారు. కరపత్రాలు, పుస్తకాలు, వీడియోల ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగును పెంచేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎడిఎలు టి.వెంకటేష్, కె.శ్రీనివాస్, డి.భరత్, కె.రత్నకుమారి, ఎం.మధుసూదన్, నిర్మలాజ్యోతి, మండల వ్యవసాయ అధికారులు, కమ్యూనిటీ సహజ వ్యవసాయాన్ని నిర్వహించించే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం మండలం కొత్తూరులో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

పొలంబడితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కురుపాం

పొలంబడితోనే రైతుకు అధిక దిగుబడులు వచ్చి ఆర్థికంగా లాభపడతాడని రైన్ ఫారెస్ట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మణికుమార్ అన్నారు. మండలంలోని మొండెంఖల్ పంచాయతీ పరిధిలో గల కొత్తూరులో వ్యవసాయ శాఖ, ఎపిసిఎన్ఎఫ్ సంయుక్తంగా పొలంబడి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి వేసిన పొలంలో శత్రు, మిత్రపురుగుల సంఖ్యాబలం పొలంబడి ద్వారా తెలుసుకొని పంటపైన తగుజాగ్రత్తలు తీసుకోవడం గట్లపై బంతి, కంది నాటించడం, రంగు పళ్ళాలు, లింగాకర్షక బుట్టలు వేయించడం, కషాయాలు తయారుచేయించడం, పక్షి స్థావరాలు వేయించి రైతులకు మంచి దిగుబడులు ఆశించడమే పొలం బడి ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది సాయిప్రభ, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది నరేష్ , ఐ సి ఆర్ పి లు, రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రిలో గురువారం జిఎపి పొలంబడి కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు మండల వ్యవసాయాధికారి జె.సౌజన్య అవగాహన కల్పించారు. పొలంలో సరైన మొక్కల సాంద్రత 33 పిలకల స్క్వేర్ మీటర్స్ చెక్ చేయడంతో పాటు నానో డిఎపి పిచికారి ఏ విధంగా చేయాలి, నీమాస్త్రం తయారు చేయు విధానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధంగా పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎం సింహాచలం, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయాలంటూ 24న నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతరాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఈనెల 24న నిరసన చేపట్టనున్నట్టు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు మరమ్మతులు చేపట్టాలని గత నుంచి నిరసనలు చేస్తున్నప్పటికీ అధికారులు కనీసం స్పందించడం లేదన్నారు. రోడ్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు ప్రస్తుతం చేయనప్పటికీ పెద్దపెద్ద గోతులను చెప్పి ట్రాఫిక్ ను అంతరాయం లేకుండా ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగేలా చర్యలు కూడా చేపట్టకపోవడం చాలా దారుణమని అన్నారు. అధికారులు, ప్రభుత్వం తీరునకు నిరసనగా రోడ్లు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శనివారం రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు.

మనుమరాలిని పాఠశాలలో చేర్పించేందుకు వెళ్తూ..

ప్రజాశక్తి-పాచిపెంట

మనుమరాలిని పాఠశాలలో చేర్పించేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన ఘటన పలువురిని కలచివేసింది. మక్కువ మండలం దబ్బగెడ్డ గ్రామానికి చెందిన ఇప్పాకుల పార్వతమ్మ (59) తమ మనుమరాలు యాగాటి మంజును ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించేందుకు గురువారం బయలుదేరింది. అయితే ఆ బాలిక రెండో తరగతి చదువుకున్న పాఠశాల నుంచి టిసి తీసుకునేందుకు పాచిపెంట మండలం కర్రివలస పయనం అయ్యారు. బస్సులు లేకపోవడంతో ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగి స్కూటీపై ఎక్కారు. మార్గమధ్యలో పి.కోనవలస ప్రభుత్వ బాలికల కళాశాల వద్ద వారి ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో పార్వతమ్మ రహదారిపై పడిపోయి అపస్మారక స్థితికి చేరుకుంది దీంతో అదే ఆటోలో సాలూరు సిహెచ్‌సికి తరలించి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించేందుకు ప్రయత్నించారు. అంతలోనే పార్వతమ్మ మృతి చెందింది. ఎఎస్ఐ శ్యామ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనవరి నాటికి ఓటరు నమోదు పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలోని ఇంటింటి ఓటర్ సర్వే 2025 జనవరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం అన్ని జిల్లాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు నమోదు కార్యక్రమం గూర్చి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మాట్లాడుతూ వచ్చే జనవరి 1 నాటికి జిల్లాలో ఇంకా నమోదు కాని యువ ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 21లోగా ఇంటింటి సర్వే బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఒ) పూర్తి చేయాలని పేర్కొన్నారు. 28 నాటికి అభ్యంతరాలను అప్డేట్ చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఓ), ఓటరు నమోదు అధికారులు, సహాయ నమోదు అధికారులకు అవసరమైన శిక్షణలు ఇవ్వాలని అన్నారు. బిఎల్ఒలు శతశాతం ఇంటింటి సమాచారాన్ని సేకరించాలని సూచించారు. అక్టోబర్ నాటికి అర్హత ఉండి నమోదు కాని వారికి ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. యువ ఓటర్ల నమోదు శాతం తక్కువగా ఉందని, నమోదు శాతం పెరగాలని అన్నారు. చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా బదిలీ చేయబడిన ఓటర్లను పక్కాగా గుర్తించాలని ఎన్నికల అధికారులు అన్నారు. సాలూరు, పాలకొండలో ఒకటి, రెండు శాతం నూతన ఓటరు నమోదైందని, మిగిలిన నియోజకవర్గాల్లో నమోదు కాలేదని, నూతన ఓటర్లు నమోదు చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఎస్ఎస్ శోభిక, డిఆర్ఒ జి.కేశవ నాయుడు, ఆర్‌డిఒలు కె.హేమలత, వివి రమణ తదితరులు పాల్గొన్నారు..

సిఐగా అప్పలనాయుడు

సాలూరు : పట్టణ సిఐగా బి.అప్పలనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు పని చేస్తున్న సిఐ వాసు నాయుడు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికెవీధి సిఐగా వున్న అప్పలనాయుడు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

హత్యాచారానికి నిరసనగా విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - సీతంపేట

కోల్‌కత్తాలో జరిగిన వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు గురువారం వినూత్న రీతిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద నల్ల బ్యాడ్జీలతో మోకాళ్లపై నిల్చొని నివాళ్లు అర్పించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆడపిల్లలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ, హెచ్ డబ్ల్యుఒ పి.అమల, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ :కోల్‌కత్తాలో జూనియర్ వైద్య విద్యార్థి డాక్టర్ మౌమిత దేబ్నాథ్‌ను అతి పాతవికంగా చంపిన వారిని కఠినంగా శిక్షించాలని యుటిఎఫ్ జిల్లా రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అత్యాచారానికి నిరసనగా

సీతంపేటలో మోకాళ్లపై నిల్చొని నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థినిలు, ఉపాధ్యాయులు

మండలంలోని బందలుప్పి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం పాఠశాల నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారాలు ఎన్ని జరిగినా దుండగులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయని అన్నారు. పని చేసే చోట మహిళా ఉద్యోగులకు విద్యార్థినులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బిసి హాస్టల్‌ను పరిశీలిస్తు అధికారులు

ఆశ్రమ విద్యార్థినుల వసతి గృహం బిసి హాస్టల్‌కు తరలింపు

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో ఇబ్బందుల దృష్ట్యా స్థానిక కస్తూరిబా పాఠశాల పక్కన ఉన్న భవనంలోనికి మార్పు చేస్తున్నట్లు ఎటిడబ్ల్యుఒ సురేష్ బాబు అన్నారు. ఈ మేరకు స్థానిక బిసి హాస్టల్‌ను పరిశీలించారు. గత ఐదేళ్ల నుంచి ఈ హాస్టల్‌లో విద్యార్థుల్లేక ఈ భవనం నిరుపయోగంగా ఉన్న విషయాన్ని గుర్తించారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం పనులు కూడా మధ్యలో నిలిచిపోయాయి. ఇప్పటివరకు గురుకుల బాలుర పాఠశాల డార్మెట్రీలో అనేక ఏళ్లుగా హాస్టల్లో నిర్వహించారు. అక్కడున్న అనేక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిసి హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బిసి హాస్టల్‌లో గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అనుకున్న స్థాయిలో మౌలిక సదుపాయాల్లేక పోయినా విద్యార్థినీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొంతమేరకు సదుపాయాలు కల్పించి భవనాన్ని మార్చేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ భవనాన్ని అందజేసేందుకు ఎబిసిడబ్ల్యూ అప్పన్నకు నివేదిక అందజేసేందుకు సిద్ధం చేశారు. ప్రస్తుతం మరుగుదొడ్లు, డార్మెట్రీ అవసరం రీత్యా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, డిప్యూటీ వార్డెన్ దివ్య జ్యోతి, స్థానిక కెజిబివి ప్రత్యేక అధికారి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలో గల తోటపల్లి దేవుస్థానం ఆవరణంలో తోటపల్లి దేవాలయ అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 25న వైద్యశిబిరం నిర్వహించనున్నామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి అన్ని విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్యనిపుణులు రానున్నారని, కావున ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన ఎంపిక పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

డిఎస్‌సి ఉచిత శిక్షణ కోసం ఎంపిక పరీక్ష స్థానిక వైటిసిల నిర్వహించారు. 422 మందికి గానూ 380 అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష నిర్వహణలో ఎపిఒ చిన్నబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు, ఎఎంఒ కోటిబాబు, జిసిటిఒ రాములమ్మ, కోఆర్డినేటర్ ముకుంద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొయిది గ్రామ సందర్శన

సీతంపేట : నేషనల్ ఇనిస్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి నాగరాజు గురువారం మండలంలో గొయిది గ్రామాన్ని సందర్శించారు. పీసా చట్టం గురించి అవగాహన కల్పించారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి సంక్షేమ పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం లో ఎంపిడిఒ గీతాంజలి, సర్పంచి పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టిరోజు వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రముఖ సినీనటుడు, పద్మ విభూషణ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఆయన అభిమానులు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నిర్వహించారు. రెడ్డి నాగరాజు, వహబ్లో ఆధ్వర్యంలో వినాయకుడి కోవెల్లో అభిమానులు, జనసైనికులు చిరంజీవి పేరున ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం 12వ వార్డులోని మున్సిపల్ స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. పాత బస్ స్టాండ్ కూడలి వద్ద అన్నదాన నిర్వహించారు. అభిమానుల మధ్య సాయంత్రం భారీగా కేక్ కటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన నాయకులు చందక అనిల్ మాట్లాడుతూ రక్తదానాన్ని ఒక సేవగా తెలుగు ప్రజలకు అలవాటు చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సిరిపురపు గౌరి, మానేపల్లి ప్రవీణ్, కడగల గణేష్, రాజ్ కుమార్, గుణాన నరేష్, గణేష్, కునుకు రమేష్ మరియు అభిమానులు పాల్గొన్నారు.

కొమరాడ : చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి అభిమానులు గురువారం కోటిపాం బ్రిడ్జి ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించారు. కె.శ్రీనివాస్, పి.పురుషోతమరావు, డి.మన్మధరావు లు బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేసి చిరంజీవి పట్ల తమ అభిమానాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు.

పేదలకు అన్నదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

ఉద్యోగినిపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అప్పటి మున్సిపల్ జె.రామ అప్పల నాయుడు హయాంలో 20 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులను నియమించారు. అయితే అందులో పువ్వుల సుమ అనే ఉద్యోగిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు ఆమెను వేధింపులకు గురి చేస్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో ఆమె అత్త, 16వ వార్డు కౌన్సిలర్ సంగిరెడ్డి లక్ష్మి పార్వతి, ఆమె భర్త సందీప్‌తో పాటు వైసిపి కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్, సువ్వాడ లావణ్య, ఎడ్ల త్రినాథ, కో-ఆప్షన్ సభ్యులు మెరువ వెంకటరావు తదితరులు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కమిషనర్ కె.శ్రీనివాస్‌తో పాటు, మున్సిపల్ ఇన్‌ఛార్జి మేనేజర్ దిబ్బా రూబేను, డిఇ కిరణ్ కుమార్ ఉద్యోగిని వేధింపులకు సంబంధించి వివరణ అడిగారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఇంజనీరింగ్ విభాగంలో ఆమె విధులు నిర్వహిస్తుండడం వల్ల సమాచారం బయటకు వెళ్తుందన్నారు. మాట్లాడిన మాటలను రికార్డింగ్ చేయడం, వీడియోలు తీయడం, వాట్సాప్ మెసేజ్ పెట్టడం వంటి పనులు చేయడం వల్ల ఆమెపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. రెండు రోజుల్లో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ఇచ్చిన నివేదికను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న ఉద్యోగి బంధువులు, కౌన్సిలర్లు